క్లుప్తంగా

ప్రజా సమస్యలపై ఫిర్యాదుల వెల్లువ



ఆర్డీఓ రాజుకు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు, కార్మికులు

నరసాపురం: సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు మొత్తం 74 ఫిర్యాదులు ఇచ్చారని ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణం చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమస్యల పరిష్కారం ఎంతవరకూ వచ్చిందనే అంశాన్ని వారంవారం తనకు నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రుద్రహోమం



రుద్రహోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మాస శివరాత్రి పురస్కరించుకుని రుద్రహోమం శాస్త్రోకంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తులు గోపూజ, స్వామివారికి అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు, అనంతరం రుద్రహోమం చేశారు. ఏడుగురు దంపతులు ఈ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామివారి మాడవీధుల్లో భక్తులు ఏడు మారేడు దళాలను చేత పట్టుకుని ఏడు ప్రదక్షిణలు చేశారు. రాత్రి స్వామివారికి లీలా కల్యాణం, పంచహారతుల కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్, సూపరింటెండెంట్ పి.వాసు, అర్చకులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించాలి



ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ గోపీమూర్తి

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వం 12వ పీఆర్‌సీని ఏర్పాటు చేసి వెంటనే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించాలని ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం పోడూరు మండలంలోని 11 ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసిన ఆయన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడిలు క్రియేట్ చేసి ఆలస్యం కాకుండా జీతాలు చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ, పీఎఫ్ రుణాలు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకేవీ రామభద్రం, రాష్ట్ర కౌన్సిల్ ఎంవీ రాజశేఖర్, మండల అధ్యక్ష కార్యదర్శులు క్షేమమూర్తి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న దాతలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పందిగుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 16 మందికి సోమవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశామని ప్రధానోపాధ్యాయులు నిల్లా సురేష్ బాబు తెలిపారు. అలాగే పట్టణానికి చెందిన దాత తెలనాకుల కిరణ్ కుమార్ పాఠశాలకు రూ.10 వేలు విలువ చేసే టేబుల్, కుర్చీలను బహూకరించినట్లు చెప్పారు. దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సేవా సమితి కార్యదర్శి నేతల రాఘవరావు, స్మార్ట్ టైలర్ రాజు, షేక్ పీర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

25న ఆర్ఆర్‌డీఎస్ కళాశాలలో మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్

భీమవరం: డిజేబుల్ పీపుల్ యువతకు ఉద్యోగావకాశాల కల్పనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 25న మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లో మెగా ప్లేస్మెంట్ డ్రైవ్ పోస్టర్‌ను డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు విడుదల చేశారు. 13 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. 400కు పైగా ఉద్యోగావకాశాలు కల్పిస్తారని, 18 – 35 ఏళ్ల వయస్సు గల పురుష, మహిళా అభ్యర్థులు, వివరాలకు 95020 24765 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గుంతల రోడ్లు.. పట్టించుకోని పాలకులు



ఏనుగువానిలంకలో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి



యలమంచిలి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ప్రమాదకరంగా ఉన్న రోడ్డు



పెనుమర్రులో దెబ్బతిన్న రోడ్డు

- సంక్రాంతి నాటికి రోడ్లు అభివృద్ధి చేస్తామన్నారు
- ఏడాదైనా అమలుకాని హామీ
- గ్రామీణ ప్రజల ఆగ్రహం

యలమంచిలి: సంక్రాంతి నాటికి గోతుల్లేని రోడ్లు చూపిస్తామని ఎన్నికల సమయంలో ప్రగల్బాలు పలికిన కూటమి నేతలు అధికారం చేపట్టి ఏడాది గడచినా ఆ మాటలు అమలుకు నోచుకోకపోవడంపై గ్రామీణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జనసేన సర్పంచ్‌లు ఉన్న గ్రామాల్లోనూ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంపై ఆ పార్టీ నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. యలమంచిలి మండలంలో ఉన్న రహదారుల్లో పాలకొల్లు – దొడ్డిపట్ల, మేడపాడు – ఏనుగువానిలంక ఆర్‌అండ్‌బీ రోడ్లు ప్రధానమైనవి. పాలకొల్లు – దొడ్డిపట్ల ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అరకొరగా మరమ్మతులు చేశారు. మేడపాడు – ఏనుగువానిలంక ఆర్‌అండ్‌బీ రోడ్డును మాత్రం పట్టించుకోలేదు. ఈ రోడ్డులో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద, ఏనుగువానిలంక ప్రారంభంలో పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. ఈ ఏడాది కాలంలో ఈ రోడ్డుపై కనీసం తట్టడు గ్రావెల్ కూడా వేయలేదు. ఈ రోడ్డుపై వేసవి కాలమంతా ట్రాక్టర్లు, లారీలపై విపరీతంగా మట్టి రవాణా చేశారు. ఆ సమయంలో రోడ్లపై పడిన మట్టి కారణంగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డంతా బురదమయంగా మారింది. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్లతోపాటు మేడపాడు –పెనుమర్రు, కట్టుపాలెం – పెనుమర్రు రోడ్లూ అధ్వానంగా ఉన్నాయి. పెనుమర్రు గ్రామ ప్రజలు నిత్యం ఈ రోడ్లపై రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్లు కూడా ధ్వంసం కావడంతో పెనుమర్రు ప్రజలు గ్రామం నుంచి బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులకే దిక్కు లేదు



మా గ్రామానికి రావడానికి నరసాపురం వైపు నుంచి ఒకటి, చించినాడ వైపు నుంచి మరో ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉంది. ఈ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ప్రధానంగా చించినాడ వైపు రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. కొద్దిపాటి వర్షం కురిసినా వారం వరకు గోతుల్లో నీరు ఉండిపోతుంది. దీంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయింది. మా గ్రామంలో జనసేన సర్పంచ్ అధికారంలో ఉన్నారు. అయినా కొత్త రోడ్డు నిర్మాణం అటుంచి, కనీసం మరమ్మతుకు కూడా ఇంతవరకు కనీసం తట్ట గ్రావెల్ కూడా వేయలేదు.

– పాలపర్తి సందీప్, ఏనుగువానిలంక

రోడ్డు కోతతో భయాందోళన



మేడపాడు నుంచి యలమంచిలి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా పెద్ద మలుపు ఉంది. ఈ మలుపులో గటాల చెరువు ఉంది. ఇక్కడ తరచుగా ప్రమాదాలు సంభవిస్తుండడంతో చెరువు మార్జిన్‌లో గోడ నిర్మించి మలుపు లేకుండా చేయడానికి గత ప్రభుత్వంలో పనులు ప్రారంభించారు. ఎన్నికల సమయంలో పనలు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా పనులు చేయడం లేదు. దీంతో పాత రోడ్డు కోతకు గురవుతూ ప్రమాదకరంగా మారింది. దీంతో మండల కేంద్రానికి వెళ్లే ప్రయాణికులు హడలెత్తిపోతున్నారు.

– కదలి ఏడుకొండలు, బూరుగుపల్లి

మీకోసంకు ఐదు అర్జీలు

ఆకివీడు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని తెలిపారు. ఆయా ఫిర్యాదుల్ని సంబంధిత అధికారులకు బదలాయించినట్లు ఆమె చెప్పారు. దుంపగడప గ్రామంలోని మంచినీటి చెరువుకు ఆనుకుని రొయ్యల చెరువు సాగు చేస్తున్నారని, చెరువు నీటిని పంట కాల్వలోకి వదిలివేస్తున్నారని మూడేళ్లుగా ఫిర్యాదులు చేస్తున్నా పట్టించోవడంలేదని గ్రామానికి చెందిన సూరంపూడి రాంబాబు ఫిర్యాదు చేశారు. స్థానిక పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద పెద పల్లి వీధి ఆక్రమణలకు గురైందని, ఆక్రమణలు తొలగించాలని, అలాగే స్థానిక ఉల్వర్టస్ పేటలోని దారి మార్గం సర్వే చేయాలని, ధర్మాపురంలోని ప్రభుత్వ భూమిలో నిర్మించుకున్న ఇళ్ల ఖాళీ చేసేందుకు ఆరు నెలలు గడువు కోరుతూ అర్జీలు అందాయి.

సోమేశ్వరునికి అభిషేకాలు



జుత్తిగలో స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పెనుమంట్ర: మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పెనుమంట్ర మండలం జుత్తిగ గ్రామంలో శ్రీ ఉమావాసుకీ రవి సోమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

నిరుద్యోగ భృతి హామీ అమలు చేయాలి



పాలకొల్లు సెంట్రల్ : పార్టీ పాలకొల్లు కార్యాలయం వద్ద నుంచి భీమవరం బయలుదేరుతున్న నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం సభ్యులు



పెనుగొండ : తూర్పుపాలెం నుంచి భీమవరం వెళుతున్న పార్టీ నాయకులు

- వైఎస్సార్ సీపీ పాలకొల్లు ఇన్‌చార్జి గోపి
- యువత పోరుకు తరలివెళ్లిన శ్రేణులు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామి ప్రకారం నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించే వరకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు వెంటనే ఇవ్వాలని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) డిమాండ్ చేశారు. యువత పోరు కార్యక్రమానికి సోమవారం పాలకొల్లు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ యూత్ వింగ్, యువజన విభాగం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు అధిక సంఖ్యలో భీమవరం కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ సూపర్ సిక్స్ అమలు చేస్తామని చెప్పి గాలికి వదిలేశారన్నారు. ఇప్పటి వరకు విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడం విద్యార్థుల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతుందని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ అమలు చేసి యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని లేదంటే నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి కల్పిస్తామని ఇచ్చిన హామీని ఎందుకు నెరవేర్చడంలేదని ప్రశ్నించారు. హామీలను మరచి రెడ్‌బుక్ పాలనకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. మహిళలకు ఒక్క హామీ పూర్తిగా నెరవేర్చలేకపోయారని తెలిపారు. స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు ఇస్తామని చెప్పి రూ.13 వేలు, అదీ కొందరికే ఇచ్చి చేతులు దులిపేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యడ్ల తాతాజీ, యినకొండ రవి, మద్దా చంద్రకళ, కోరాడ శ్రీను, ఉచ్చుల స్టాలిన్, బండి రమేష్, పాలపర్తి సందీప్, కెల్లా పెద్దిరాజు, జోగి వెంకటేశ్వర్లు, సాలా నర్సయ్య, రాజేష్, మామిడిశెట్టి చిట్టిబాబు, గేదెల నరసింహరావు, ఉండ్రాజవరపు రవి తదితరులు పాల్గొన్నారు.

యువతను మోసం చేసిన పాలకులు

పెనుగొండ : కల్లబొల్లి హామీలతో అధికారం చేపట్టిన కూటమి నాయకులు యువతను మోసం చేసిందని ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద) విమర్శించారు. భీమవరంలో చేపట్టిన యువత పోరుకు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాలతో తూర్పుపాలెం నుంచి ఆచంట నియోజకవర్గం నాయకులు, ప్రజా ప్రతినిధులు భారీగా తరలివెళ్లారు. మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగా నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు సత్వరం చెల్లించాలని డిమాండ్ చేశారు. భీమవరం వెళ్లిన వారిలో నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు గొట్టుముక్కల సునీల్ వర్మ, యూత్ జిల్లా ఉపాధ్యక్షుడు తమనంపూడి సూర్య వెంకట గణేష్ రెడ్డి, ఆచంట సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, మండల కన్వీనర్లు జక్కంశెట్టి చంటి, పిల్లి నాగన్న, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు పోతుమూడి రామచంద్రరావు, ఎస్సీ సెల్ కన్వీనరు పలివెల శ్రీను, గుబ్బల వీరబ్రహ్మం, కర్రి వేణుబాబు, రత్నకుమార్, గొట్టుముక్కల ఏసు రత్నం, దొంగ దుర్గా ప్రసాద్, సుబ్రహ్మణ్యం, నాగార్జునలు ఉన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

పాలకోడేరు: భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.బలరామరాజు నేతృత్వంలో సోమవారం గరగపర్రులో దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన కె.రాజు వద్ద ఏడు మద్యం సీసాలు లభ్యం కావడంతో అతడిని అరెస్ట్ చేసినట్లు సీఐ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా మద్యం అక్రమంగా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో ఎస్సైలు పి ఉమామహేశ్వరరావు, పి సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిజం సర్టిఫికెట్ కోర్సుపై అవగాహన



డీఎన్నార్ కళాశాలలో మాట్లాడుతున్న కొండలరావు

పాలకొల్లు సెంట్రల్: మీడియా రంగంలోనూ అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఆకాశవాణి, దూరదర్శన్ వార్తల విభాగం పూర్వ అధిపతి యనెస్కో క్లబ్ ఆఫ్ గుంటూరు గౌరవ అధ్యక్షుడు ఐఐఎస్ డాక్టర్ గుత్తికొండ కొండలరావు అన్నారు. సోమవారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జర్నలిజం సర్టిఫికెట్ కోర్సుపై ఏర్పాటుచేసి అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జర్నలిజం సర్టిఫికెట్ కోర్సుకు తన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాబోధనలో వినూత్న మార్పులు తీసుకురావాలి

భీమవరం: విద్యాబోధనలో వినూత్న మార్పులు తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని తమిళనాడులోని మధురై త్యాగరాజ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ ఎస్ భాస్కర్ అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల వర్క్‌షాప్‌ను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యా విధానంలో టీచింగ్ లెర్నింగ్‌లో లక్ష్యాలు సాధించే దిశగా మార్పులు జరగాలన్నారు. పరిశ్రమల అవసరాలకు తగిన విధంగా విద్యాబోధన ఉంటే విద్యార్థులు మరిన్ని ఫలితాలు సాధించగలరని భాస్కర్ నొక్కి చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో ఎప్పటికప్పుడు చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు కూడా నూతన అంశాల అధ్యయనం చేసేందుకు ఇటువంటి వర్క్‌షాప్‌లు దోహదపడతాయన్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్ రాజేష్ పాల్గొన్నారు.

నేడు వరి, ఉద్యాన పంటలపై శిక్షణ

ఉండి: ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం కృషీ విజ్ఞాన కేంద్రంలో జిల్లాస్థాయిలో వరి, ఉద్యాన, ఆయిల్‌పామ్ పంటలపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మల్లిఖార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పంటలను సోకే చీడపీడలు, వాటి పరిష్కారం, నివారణా మార్గాలు సూచించడం జరుగుతుందన్నారు. రైతులు పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విధులు బహిష్కరించిన కాంట్రాక్ట్ ఉద్యోగులు



మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

నరసాపురం: సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికులు చేపట్టిన ఆందోళనను సోమవారం నుంచి ఉధృతం చేశారు. విధులు బహిష్కరించి సమ్మెబాట పట్టారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఉదయం నుంచి బైఠాయించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో ఏళ్ల తరబడి పనిచేస్తోన్న తమపట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించకపోవడం దారుణమన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పదేళ్లుగా పనిచేస్తున్న కార్మికులను రెగ్యులైజ్ చేయాలని, హెచ్‌ఆర్‌సీ పాలసీ అమలు చేయాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి కోటిపల్లి కాశీ, ఎం రత్నం, సీహెచ్ సత్యనారాయణ, ఫణి తదితరులు నాయకత్వం వహించారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో కొత్త కోర్సులు



క్యాంపెయిన్ చేస్తున్న ఏఎస్ఎన్ఎం కళాశాల అధ్యాపకులు

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ కళాశాలల్లో చేరితే ప్రభుత్వం నుంచి అనేక పథకాలు అందుతాయని, మంచి ప్లేస్‌మెంట్‌లు కూడా ఉంటాయని ప్రిన్సిపాల్ డాక్టర్ తిరువీధుల రాజరాజేశ్వరి అన్నారు. సోమవారం పట్టణ పరిసర ప్రాంతాల్లో అద్దేపల్లి సత్యనారాయణమూర్తి (ఏఎస్ఎన్ఎం) ప్రభుత్వం డిగ్రీ కళాశాల అధ్యాపకులు అడ్మిషన్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ కళాశాలలో హాస్టల్ సౌకర్యం ఉందన్నారు. కళాశాల స్వయం ప్రతిపత్తి కలిగి ఉండడంతో నోడల్ సెంటర్‌గా వ్యవహరిస్తూ జాబ్‌మేళా ద్వారా క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని వివరించారు. విద్యార్థినులకు టైలరింగ్, మగ్గం వర్క్, ఎంబ్రాయిడరీ వర్క్‌లలో శిక్షణ పూర్తిచేసుకున్న వారికి కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది నుంచి విద్యార్థులకు ఏసి మెకానిజం, సబ్బులు తయారీ, సేంద్రియ ముడి పదార్థాలతో చాక్లెట్ల తయారీలో శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. డ్యూయల్ మేజర్ కోర్సులతో బీఎస్సీ (మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, బోటనీ, జువాలజీ, మైక్రో బయాలజీ, బయోటెక్నాలజీ, స్టాటటిక్స్, బీకాం (జనరల్), బీకాం కంప్యూటర్స్, బీఏ (ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ)లతో పాటు ఎంఏ ఎకనామిక్స్, ఎంకామ్, ఎంఎస్సీ (ఆక్వాకల్చర్), ఎంఎస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ), ఎంఎస్సీ (బోటనీ) వంటి కోర్సులు ఈ ఏడా నుంచి నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు నేరుగా కళాశాల వద్ద హెల్ప్ డెస్క్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, కె భద్రాచలం, వియామిని, బూసి వెంకటస్వామి, ఎస్‌వీడీ దినకరన్, శివకృష్ణ, వి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు



పీహెచ్‌సీలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ నీరజ

పాలకొల్లు సెంట్రల్: రెండు వారాలకు మించి దగ్గు, తెమడ పడటం, సాయంత్రం సమయంలో జ్వరం రావడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని రాష్ట్ర టీబీ ముక్తి భారత్ కన్సల్టెంట్ డాక్టర్ టి.నీరజ సూచించారు. సోమవారం పాలకొల్లు మండలం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. టీబీ పరీక్షల ల్యాబ్, ప్రసవ గది, ఇంజక్షన్ ఇచ్చు గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా నీరజ మాట్లాడుతూ పై లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గర్లో ఉన్న ఆశ, ఏఎన్ఎంలను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలలకు మందులు ఉచితంగా అందిస్తారని, నెలకు రూ.వెయ్యి చొప్పున రూ. 6 వేలు ఇస్తారని తెలిపారు. వ్యాధి సోకిన వ్యక్తులు ఎక్కడపడితే అక్కడ ఉమ్మివేయరాదని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం నవ్య జీవన్, కె.సందీప్, గుడాల హరిబాబు, పి.ఎలిజిబెత్, కె.అమలేశ్వరరావు, స్వామి, రమేష్ బాబు, కె.సత్తిబాబు, కె.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జారుడు బల్లల్లా రోడ్లు



పెనుగొండ : మునమర్రు రహదారిపై పేరుకు పోయిన నల్లమట్టి



పెనుంగొండ : పెనుగొండ శివారు మట్టి వాహనాల రాకపోకలతో తూట్లు పడ్డ రోడ్డు

పెనుగొండ: మునమర్రు రహదారి జారుడు బల్లలా తయారైంది. రెండు రోజులుగా చిన్నపాటి చినుకులు పడడంతో ఈ రహదారిలో ప్రయాణిస్తే చాలు జర జర జారుతూ గాయాల పాలవుతున్నారు. పెనుగొండ గ్రామం మధ్య నుంచి మునమర్రు వరకు రెండు కిలో మీటర్ల రహదారి ఉంది. ఈ మార్గంలో వేసవి కాలంలో మట్టి రవాణా ఇష్టారాజ్యంగా జరిగింది. ఇటీవల రహదారికి అనుకొని ఉన్న పంటకాలువ పూడిక తీసి, ఆ మట్టిని రహదారి పక్కనే వదలివేశారు. నాలుగు రోజులుగా వర్షాలు పడుతుండడతో మట్టి ట్రాక్టర్లతో రోడ్డుపైకి చేరిన నల్లమట్టి అంతా చిత్తడి చిత్తడిగా మారింది. రోడ్డుకు సగభాగం పంటకాలువ పూడిక మట్టి ఆక్రమించేయడంతో వర్షం నీరు నల్లమట్టితో కలిసి జారుడు బల్లలా మునమర్రు రహదారి తయారైంది.

మునమర్రు వాసులు గాయాలపాలు

వర్షం కురవడంతో ఈ రహదారిలో ప్రయాణించిన పలువురు జారిపడి గాయాల పాలయ్యారు. డిగ్రీ చదువుతున్న ఓ యువకుడు పెనుగొండ నుంచి మునమర్రు వెళుతుండగా నల్లమట్టితో జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా కాలుకు బ్యాండేజీ వేసి 45 రోజులు పాటు జాగ్రత్తలు తీసుకొన్న అనంతరం శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పారు. మరో వ్యక్తి మోటారు సైకిల్‌తో జార పడడంతో కొద్దిపాటి గాయాలతో బయట పడ్డాడు. కుటుంబ సభ్యులతో కలసి వెళుతుండగా జారిపడి మరో మహిళ గాయపడ్డారు. మునమర్రు వెళ్లడానికి మరో రహదారి ఉన్నా, రైతులు మాత్రం ఇదే రహదారిలో నిత్యం రెండు మూడు పర్యాయాలు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. రైతులు తరచూ పడుతూ లేస్తూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారిపై పేరుకుపోయిన నల్లమట్టిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉచిత అడ్మిషన్లు అమలు చేయాలి



ఆర్డీఓ రాజుకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

నరసాపురం: ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం పేదలకు 25 శాతం ఉచిత అడ్మిషన్లు అమలు చేయాలని పేరెంట్స్ కమిటీ గౌరవ అధ్యక్షుడు ముచ్చర్ల త్రిమూర్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నరసాపురం ఆర్డీఓ దాసి రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనలను ప్రైవేట్ విద్యాసంస్థలు అమలు చేయడంలేదని పేర్కొన్నారు. అడ్మిషన్స్ అయిపోయాయని, సీట్లు లేవని వంకలు చెబుతున్నారని వివరించారు. నిబంధనలు అమలు చేయని, అధిక ఫీజులు వసూలు చేస్తోన్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు యు.నాగేంద్ర, బెల్లంకొండ కనకదుర్గ, సీహెచ్ రాజేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా మల్లిపూడి చెరువుగట్టు రోడ్డు



మల్లిపూడి పంచాయతీ చెరువుగట్టు రహదారి

పెనుమంట్ర: ఒకప్పుడు ఉత్తమ గ్రామ పంచాయతీగా పేరొంది, అనేక అవార్డులు అందుకున్న మల్లిపూడి గ్రామ పంచాయతీ నేడు నిధులు లేమితో కొట్టిమిట్టాడుతోంది. గ్రామంలో ఏ వీధికి వెళ్లినా విశాలమైన సీసీ రోడ్లు, డ్రెయిన్లతో ఆహ్లాదకర వాతావరణంతో దర్శనమిస్తుంది. అయితే గ్రామ పంచాయతీ చెరువుగట్టున 25 మీటర్ల పొడవు ఉన్న రోడ్డు బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి అనుసంధానంగా చెరువుచుట్టూ ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉన్నప్పటికీ పాలి, రామేశ్వరం నుంచి మల్లిపూడి వచ్చే ప్రయాణికులు ఈ రోడ్డుపైనే ప్రయాణిస్తుంటారు. గ్రామ పంచాయతీ తక్షణం స్పందించి రోడ్డును పునర్నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.